క్లుప్తంగా

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న సిబ్బంది

మద్దిలపాలెం : రోటరీ క్లబ్ ఆఫ్ వైజాగ్ మెట్రో ఆధ్వర్యంలో ఇసుకతోట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గురువారం వైద్య పరీక్షలు చేశారు. కంటి పరీక్షలు, దంత పరీక్షలు, సాధారణ ఆరోగ్య పరీక్షలు చేశారు. ఈ వైద్య శిబిరాన్ని రోటేరియన్ సునీత లావణ్య, ఇంటర్నేషనల్ హయ్యర్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ (ఐహెచ్‌ఎంఎస్) విద్యార్థులు, ఐహెచ్‌ఎస్‌ఎం ఎండీ సంధ్య సౌజన్యంతో డైరెక్టర్ ఒమ్మి కిరణ్ కుమార్ పర్యవేక్షణలో చేశారు. డాక్టర్ ఎస్.ప్రవీణ్ కుమార్, డాక్టర్ ఎం.గంగాధరరావు పరీక్షలు చేశారు. పి.బి.ఎస్.ఎస్.ఎన్.రెడ్డి, ప్రశాంతి, హరిత, శ్వేత, మహేష్ మోదిలి, శీల, కిరణ్, వరుణ్, సందీప్ పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు నిల్వ చేసిన వ్యక్తికి రిమాండ్

ఆరిలోవ : అక్రమంగా మద్యం బాటిళ్లు నిల్వ చేసి టాస్క్‌ఫోర్స్ పోలీసులకు పట్టుబడిన వ్యక్తిని ఆరిలోవ పోలీసులు గురువారం రిమాండ్‌కు తరలించారు. జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి దారపాలెంలోని ఓ ఇంట్లో అక్రమంగా డిఫెన్స్ మద్యం బాటిళ్లు నిల్వ చేసిన పోలాకి జీవన్‌రావు (55)ను బుధవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఉన్న 20 డిఫెన్స్ బాటిళ్లు స్వాధీనం చేసుకుని ఆరిలోవ పోలీసులకు అప్పగించిన విషయం తెలిసిందే. దీనిపై ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేసి జీవన్‌రావును గురువారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు సీఐ హెచ్.మల్లేశ్వరరావు తెలిపారు.

జిమ్ నిర్వాహకులపై ఫిర్యాదు

ఎంవీపీ కాలనీ : పెదవాల్తేర్ దరి ఆదర్శనగర్‌లోని ట్రాన్స్‌ఫార్మర్ జిమ్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు ఎంవీపీ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. వ్యాయామం నిమిత్తం పెద్ద ఎత్తున జిమ్ నిర్వాహకులకు నెలవారి, సంవత్సరాది చందాలు కట్టినట్లు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా జిమ్‌ను మూసేశారని తెలిపారు. ఈ నేపథ్యంలో తాము కట్టిన చందాలు తిరిగి ఇప్పించాలని, లేనిపక్షంలో జిమ్‌ను పునఃప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ఎంవీపీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్య కేంద్రాల్లో 63 పరీక్షలూ చేయాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: అన్ని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో తప్పనిసరిగా ప్రభుత్వం నిర్దేశించిన 63 టెస్టులు జరగాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. తన కార్యాలయ సమావేశ మందిరంలో మలేరియా అధికారులు, అసిస్టెంట్ మలేరియా అధికారులు, సబ్ యూనిట్ అధికారులు, సూపర్‌వైజర్లు, ల్యాబ్ టెక్నీషియన్లతో సమావేశమై పలు అంశాలు చర్చించారు. ఐవీఆర్‌ఎస్ ప్రకారం మన జిల్లా టెస్టుల్లో వెనుకబడి ఉందన్నారు. అన్ని టెస్టులకు అవసరమైన కెమికల్స్ సరఫరా చేయాలని జిల్లా మలేరియా అధికారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ సీహెచ్ సత్యనారాయణ, సబ్ యూనిట్ అధికారి నగేష్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో 8.6 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్‌లో గంజాయిని అక్రమంగా తరలిస్తున్న నిందితులను రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని, 8.6 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలిలా.. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్‌ఐ ఎస్.రామారావు, సీఐబీ విశాఖపట్నం ఏఎస్‌ఐ జె.తమ్మునాయుడు తమ సిబ్బందితో కలిసి గురువారం విశాఖ రైల్వే స్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫారాల్లో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. కేరళ రాష్ట్రం అలెప్పి జిల్లాకు చెందిన ఆశ్రిత్, మొహ్మద్ ఆల్తాఫ్‌లు విశాఖ రైల్వే స్టేషన్ మీదుగా అక్రమంగా గంజాయి రవాణా చేస్తుండడాన్ని గుర్తించారు. వీరి వద్ద నుంచి సుమారు రూ.43 వేల విలువైన 8.6 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని, నిందితులను ఎస్‌ఐ రామారావుకు అప్పగించారు. రిమాండ్ నిమిత్తం నిందితులను కోర్టులో హాజరు పరిచారు.

హడలెత్తిస్తున్న గెడ్డ

- వాసవానిపాలెం వద్ద ప్రమాదాలకు గురవుతున్న మత్స్యకారులు
- వర్షం కురిస్తే గెడ్డ నీరు సముద్రంలో కలిసే చోట భయానక పరిస్థితి
- ఇటీవల మత్స్యకార యువకుడి మృతితో పెరిగిన ఆందోళన
- తీరంలో కాంక్రీట్ గోడలు నిర్మించాలంటూ మత్స్యకారుల డిమాండ్



ప్రవాహం కారణంగా వాసవానిపాలెం వైపు పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు



వాసవానిపాలెం వద్ద గెడ్డ ప్రవాహం సముద్రంలో కలిసే ప్రాంతం

ఎంవీపీ కాలనీ : మత్స్యకార ప్రాంతాల ప్రజలను జీవీఎంసీ 19వ వార్డు పరిధి వాసవానిపాలెం వద్ద ఉన్న గెడ్డ హడలెత్తిస్తోంది. వర్షం కురిస్తే అటు వైపు వెళ్లేందుకు మత్స్యకారులు భయంభ్రాంతులకు గురవుతున్నారు. విశాఖ నగరంలోని మురుగునీరు సముద్రంలోకి ప్రవహించే ప్రధాన గెడ్డల్లో వాసవానిపాలెం సముద్రతీరం వద్ద కలిసే గెడ్డ ఒకటి. ఇటు ముడసర్లోవ, పైనాపిల్ కాలనీ, ఆరిలోవ, హనుమంతవాక కూడలి నుంచి... అటు సీతమ్మధార, హెచ్‌బీ కాలనీ, కేఆర్‌ఎం కాలనీ, మద్దిలపాలెం, శివాజీపాలెం నుంచి ఎంవీపీ కాలనీ వైపుగా ప్రవహించే ఈ గెడ్డ వాసవానిపాలెం వద్ద సముద్రంలో కలుస్తుంది. అయితే ఈ ప్రాంతాల్లో భారీ వర్షం కురిసినప్పుడు గెడ్డ ప్రవాహ ఉధృతి ఒక్కసారిగా ప్రమాదకర స్థాయికి చేరుతోంది. ఆ సమయంలో తీరం వద్ద వేట చేసే మత్స్యకారులు, అటుగా వెళ్లే మత్స్యకారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

పెరుగుతున్న ప్రమాదాలు

గెడ్డలో వరద నీటి ఉధృతి ఎక్కువగా ఉన్న సమయంలో అనుకోకుండా అటువైపుగా వెళ్లిన వారు ప్రమాదాల బారిన పడుతున్నారు. కొందరు మత్స్యకారులు వరద సమయంలో చేపలు పడతాయనే ఆశతో వేటకు వెళ్లి ప్రమాదానికి గురవుతున్నారు. గతంలో రెండు, మూడు సార్లు ఇలానే ప్రమాదాలు జరిగినట్లు ఆయా ప్రాంతాల మత్స్యకారులు వెల్లడిస్తున్నారు. ఇటీవల కూడా భారీ వర్షం సమయంలో ఓ మత్స్యకార యువకుడు సముద్రంలో గెడ్డ కలిసే చోట చేపల వేటకు వెళ్లి ప్రమాదానికి గురయ్యాడు. ఈత వచ్చినప్పటికీ వరద ప్రవాహంలో కొట్టుకుపోవడంతో ఆ యువకుడు మృత్యువాత పడ్డాడు. గతంలోనూ ఇలా ప్రమాదాలు జరిగినట్లు వాసవానిపాలెం మత్స్యకారులు పేర్కొంటున్నారు. గతంలో వాసవానిపాలెం, లాసన్స్ బే పార్కు మధ్యలో గెడ్డకు కొంత భాగం వరకు జీవీఎంసీ అధికారులు కాంక్రీట్ గోడ నిర్మించనట్లు చెబుతున్నారు. అయితే ఆ గోడను తీరం వైపు మరింత పెంచడం ద్వారా ఈ ప్రమాదాలను అడ్డుకోవాలని వారు కోరుతున్నారు.



ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న వర్షం నీటితో లాసన్స్‌బే కాలనీ వద్ద ప్రమాదకరంగా గెడ్డ ప్రవాహం

రక్షణ గోడ లేకపోవడంతోనే..



వర్షం కురిసినప్పుడు వరద నీటి ప్రవాహం భారీగా ఉంటుంది. వాసవానిపాలెం, గణేష్‌నగర్, పెదజాలరిపేట సముద్ర తీరాల్లో ఈ వరద నీటి ప్రభావం చాలా అధికంగా ఉంటుంది. నీటితో వచ్చే చెత్త పెద్ద ఎత్తున వాసవానిపాలెం వైపు పోగవుతోంది. దీంతో ఈ ప్రాంత వాసులు కాలుష్యం బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో గెడ్డ రక్షణ గోడను మరింత లోపలికి నిర్మించాలని ప్రభుత్వాన్ని చాలా కాలంగా కోరుతున్నాం. దీని ద్వారా ప్రమాదాలను కొంతమేరకు అడ్డుకోవచ్చు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రక్షణగోడ నిర్మించాలి.

– చిలకమ్మ, మత్స్యకార మహిళ

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా



సముద్రంలో గెడ్డ నీటి ప్రవాహం కలిసేచోట అసాంఘిక కార్యకలాపాలు కూడా సాగుతున్నాయి. చాలా మంది బయటి వ్యక్తులు లాసన్స్ బే పార్కు వైపుగా ఇక్కడికి చేరుకుని గుంపులుగా మద్యం సేవిస్తున్నారు. గెడ్డ మీదుగా అటు నుంచి వాసవానిపాలెం వైపు వస్తున్నారు. దీంతో ఈ ప్రాంతంలో రాత్రిపూట ఆందోళనకరంగా ఉంటుంది. గెడ్డ కాంక్రీట్ గోడలు తీరం వైపు మరింత లోపలికి నిర్మిస్తే అసాంఘిక కార్యకలాపాలకు సైతం అడ్డుకట్ట పడుతుంది.

– భూలోకమ్మ, మత్స్యకార మహిళ

ఆవిష్కరణల దిశగా పనిచేయాలి



ఆచార్య నరహరి శాస్త్రికి జ్ఞాపిక అందిస్తున్న రిజిస్ట్రార్ ఆచార్య రాంబాబు

మద్దిలపాలెం : విద్యార్థులు ఆవిష్కరణల దిశగా పనిచేయాలని భట్నాగర్ అవార్డు గ్రహీత, ఐఐటీ హైదరాబాద్ పూర్వ సంచాలకులు జి.నరహరి శాస్త్రి సూచించారు. ఏయూ కెమిస్ట్రీ విభాగంలో ప్రొఫెసర్ జి.నాగేశ్వరరావు ఎండోమెంట్ లెక్చర్‌లో భాగంగా గురువారం ఆయన ప్రసంగించారు. నేటి సమాజంలో రసాయన శాస్త్రం, బయాలజీ, ఏఐ టెక్నాలజీలను మిళితం చేస్తూ జరుగుతున్న పరిశోధనలను వివరించారు. 2024 సంవత్సరానికి నోబెల్ బహుమతిని రసాయన శాస్త్రవేత్త, టెక్నాలజిస్టుకు సంయుక్తంగా అందించిన విధానం, వారు చేసిన పరిశోధనలను విద్యార్థులకు వివరించారు. ఆత్మగౌరవంతో స్వయం సమృద్ధి దిశగా సాగాలని సూచించారు. ఏఐ అనువర్తనాలు, అభివృద్ధిని తెలిపారు. ఊహకందని వేగంతో అభివృద్ధి జరుగుతోందన్నారు. ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ మాట్లాడుతూ నూతన జ్ఞానాన్ని అందిస్తూ, విస్తృత అవగాహన కల్పించే ఇటువంటి కార్యక్రమాల్లో విద్యార్థుల భాగస్వామ్యం పూర్తి స్థాయిలో ఉండాలన్నారు. ఆచార్య నరహరి శాస్త్రి పరిశోధన విధానం, సాధించిన ప్రగతి నేటి తరం యువతకు స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. శాస్త్ర విజ్ఞాన నాయకత్వానికి ఉదాహరణగా ఆయన నిలుస్తారన్నారు. అనంతరం వర్సిటీ తరఫున ఆచార్య నరహరి శాస్త్రిని సత్కరించి జ్ఞాపిక బహూకరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, మాజీ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు, విభాగాధిపతి ఆచార్య శ్యామల పాల్గొన్నారు.

పుస్తెల తాడు దొంగలను వెతికితే...
బైక్‌ల దొంగలు దొరికేశారు..!

- ఇద్దరు నిందితుల నుంచి ఆరు ద్విచక్ర వాహనాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఆరిలోవ క్రైమ్ పోలీసులు

ఆరిలోవ : పుస్తెల తాడు తెంపుకుపోయిన దొంగల కోసం వెతికితే ఏకంగా ఆరు ద్విచక్ర వాహనాలు దొంగలించిన ఇద్దరు దొంగలు పోలీసులకు చిక్కారు. అయితే ఆ ఇద్దరు నిందితుల్లో ఒకరు బాలుడు కావడం గమనార్హం. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జాతీయ రహదారిపై వాకింగ్‌కు వెళ్లిన ఓ మహిళ మెడలోని మూడు తులాల బంగారు పుస్తెల తాడు దొంగిలించిన ఇద్దరిని ఆరిలోవ క్రైం పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు.

జీవీఎంసీ పదో వార్డు పరిధి ఆదర్శనగర్‌కు చెందిన కృష్ణవేణి (49) గత నెల 25న వాకింగ్ చేస్తున్న సమయంలో వెనుక నుంచి ద్విచక్ర వాహనంపై గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి ఆమె మెడలోని పుస్తెల తాడు తెంపుకుని పరారయ్యారు. దీనిపై అదే రోజు ఆమె ఇచ్చిన ఫిర్యాదుతో ఆరిలోవ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ద్వారకా క్రైం సీఐ వి.చక్రధర్ పర్యవేక్షణలో ఎస్‌ఐ ఎ.హరికృష్ణ సిబ్బందితో కలిసి బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలించారు. దొంగతనం జరిగిన ప్రాంతం నుంచి సీసీ కెమెరాలు పరిశీలించి నగరంలో ఓ చోట ఇద్దరు నిందితులను గురువారం పట్టుకున్నారు. వారు చినవాల్తేరు ప్రాంతానికి చెందిన యరమశెట్టి అవిక్ కుమార్ (19)తోపాటు మరో బాలుడు అని నిర్ధారించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా బైక్‌ల దొంగతనం విషయం వెలుగులోకి వచ్చినట్లు ఎస్‌ఐ హరికృష్ణ తెలిపారు. వారు మహిళ మెడలో దొంగిలించిన పుస్తెల తాడు గుర్తు తెలియని వ్యక్తికి విక్రయించేసి రెండు ఫోన్లు కొనుక్కుని, మిగిలిన డబ్బులు ఖర్చు చేసేసినట్లు తెలిపారు. వారి నుంచి ఆ రెండు ఫోన్లతోపాటు గతంలో గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగిలించిన మూడు ద్విచక్ర వాహనాలు, పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగిలించిన రెండు ద్విచక్ర వాహనాలు, గోపాలపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగిలించిన ఒక మోటార్ సైకిల్, ఎంవీపీ పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగిలించిన రూ.500 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుల్లో అవిక్ కుమార్‌ను కేంద్ర కారాగారానికి రిమాండ్‌కు తరలించగా, బాలుడిని బాలుర ప్రత్యేక గృహానికి తరలించామని ఎస్‌ఐ తెలిపారు.

ఏయూ వీసీగా సర్వేపల్లి పనిచేయడం గర్వకారణం



ఏయూలో మొక్కలు నాటుతున్న వీసీ ఆచార్య రాజశేఖర్, ఆచార్యులు, విద్యార్థులు

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతిగా సర్వేపల్లి రాధాకృష్ణన్ పనిచేయడం విశ్వవిద్యాలయానికి గర్వకారణమని ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు భారతరత్న బహూకరించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని ఏయూలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా గురువారం ఏయూ వృక్షశాస్త్ర విభాగం ఆవరణలో పలు దేశీ, పండ్ల మొక్కలను ఆయన నాటారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మొక్కలు నాటడం, పెంచడం ఒక బాధ్యతగా స్వీకరించాలని సూచించారు. వృక్షశాస్త్ర విభాగాధిపతి ఆచార్య సంధ్య దీపిక మాట్లాడుతూ మొదటి విడతలో 50 రకాల పండ్ల మొక్కలు నాటుతున్నామని, 500 మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ సందర్భంగా రెక్టార్ ఆచార్య కిషోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు మొక్కలు నాటారు.

గణపతి మండపాల వద్ద అన్నసమారాధనలు



విశాలాక్షినగర్‌లో అన్నప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ వెంకటరత్న స్వాతి



పదమూడో వార్డులో అన్నప్రసాదం వడ్డిస్తున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మొల్లి అప్పారావు

ఆరిలోవ : వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జీవీఎంసీ తొమ్మిదో వార్డు విశాలాక్షినగర్‌లో ఉత్తమ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్న సంతర్పణ చేశారు. స్థానిక కార్పొరేటర్ కోరుకొండ వెంకటరత్న స్వాతి నిర్వాహకులతో కలిసి భక్తులకు ప్రసాదం వడ్డించారు.

- జీవీఎంసీ పదమూడో వార్డులో లిటిల్ గణేష్ యూత్ ఆధ్వర్యంలో గురువారం అన్నసమారాధన చేపట్టారు. వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు పాల్గొని పార్టీ స్థానిక నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి భక్తులకు ప్రసాదం వడ్డించారు. నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు కె.శిరీష, ప్రసంగి వాసు, బేత దుర్గారావు, బేగం, కొండమ్మ, దేవి రామారావు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మద్దిలపాలెం : జీవీఎంసీ 16వ వార్డు రజక వీధిలో ప్రిన్స్ డేంజర్ బాయ్స్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన అన్నసమారాధను వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు ప్రారంభించారు. అనంతరం అదే వార్డు పరిధి హెచ్‌బీ కాలనీలో లక్కీ బాయ్స్ ఆధ్వర్యంలో, స్వాతి అపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో అన్నసమారాధను ఆయన ప్రారంభించారు. వార్డు అధ్యక్షుడు చొల్లంగి నాగేశ్వరరావు, శ్రీనివాసరాజు, సూర్యనారాయణరాజు, అనిల్‌రాజు, వేములవలస అప్పారావు, మీసాల ప్రదీప్, వేణుగోపాల్ రెడ్డి, మెట్ట సూర్యనారాయణ, చింతా వెంకటరావు, సక్కాన కమల్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు



16వ వార్డులో అన్నప్రసాదం వడ్డిస్తున్న మొల్లి అప్పారావు, తదితరులు

- జీవీఎంసీ 23వ వార్డు పరిధి చైతన్యనగర్‌కాలనీ, కేఆర్‌ఎం కాలనీలో అన్నసమారాధనలను మొల్లి అప్పారావు ప్రారంభించారు. వార్డు ఇన్‌చార్జి పులగం సూర్యనారాయణ రెడ్డి, వార్డు అధ్యక్షుడు బూస రమణారెడ్డి, పులగం శ్రీనివాసరెడ్డి, ఎంర్రెడ్ల ఈశ్వరరెడ్డి, ఎరుసు అరుణ, బోర రాము, బోయి రమణ పాల్గొన్నారు.
- జీవీఎంసీ 22వ వార్డు పీతలవానిపాలెం జె.జె.బాయ్స్ ఆధ్వర్యంలో గురువారం భారీ అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పీతల గోవింద్ భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. అనంతరం కమిటీ సభ్యులు జగదీష్, అప్పలస్వామి, వెంకటరావు, తదితరులు పీతల గోవింద్‌ను సత్కరించారు.

కూటమి ప్రభుత్వ పాలన మోసపూరితం

వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు



ఆదర్శనగర్‌లో మహిళకు కరపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు, నాయకులు

ఆరిలోవ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మోసపూరిత పాలనతో ప్రజలను ఇబ్బంది పెడుతోందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు ఆరోపించారు. జీవీఎంసీ పదో వార్డులో బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. వార్డులోని ఆదర్శనగర్ ప్రాంతం 79వ బూత్ పరిధిలో వార్డు అధ్యక్షుడు పతివాడ కనకరాజు, స్థానిక నాయకులతో కలిసి ఆయన గడప గడపకు వెళ్లి కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, మోసాలను తెలియజేసే కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. మహిళలపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇన్ని జరుగుతున్నప్పటికీ రాష్ట్ర హోం మంత్రి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మహిళల రక్షణ కోసం ప్రత్యేకంగా దిశ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేసి రక్షణ కల్పించారన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బొండా శ్రీనివాసరావు, మున్సిపల్ విభాగం అధ్యక్షుడు వైదా నారాయణరావు, ఇట్ల వరలక్ష్మి, పతివాడ వెంకటలక్ష్మి, తులసి, అబ్దుల్ రావూఫ్, సూరిబాబు, రవికుమార్, జయశ్రీ, మన్మథరావు పాల్గొన్నారు.

అజాత శత్రువు సురవరం



సురవరం సుధాకరరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

అల్లిపురం: సీపీఐ జాతీయ పూర్వ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి అజాతశత్రువుగా, వివాదరహితుడుగా పేరుగాంచారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ఆయన పార్టీ పట్ల అంకిత భావంతో పని చేసేవారన్నారు. అల్లిపురంలోని పార్టీ కార్యాలయంలో గురువారం సాయంత్రం జరిగిన సురవరం సుధాకర్ రెడ్డి సంతాప సభలో ఆయన పాల్గొని సుధాకరరెడ్డికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుధాకర్ రెడ్డి కర్నూలు నుండి రాజకీయ ప్రస్థానం ప్రారంభించి ఢిల్లీ స్థాయికి ఎదిగారన్నారు. మావోయిస్టులను చంపేస్తామని హోం మంత్రి అమిత్ షా రంకెలు వేస్తున్నారని విమర్శించారు. ఈ విధంగా గతంలో ఏ హోం మంత్రి వ్యవహరించలేదని అన్నారు. పార్టీ సీనియర్ నాయకులు మానవ ఆంజనేయులు మాట్లాడుతూ సుధాకర్ రెడ్డితో తనకున్న అనుబంధాన్ని వివరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే రెహమాన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి, రాష్ట్ర సమితి సభ్యులు సీహెచ్ రాఘవేంద్రరావు, జీవీఎంసీ సీపీఐ పక్ష నాయకుడు, కార్పొరేటర్ ఏజే స్టాలిన్, మహిళా చేతన నాయకురాలు కత్తి పద్మ, ఎస్. గోవిందరాజులు, గణేష్ పాండా, కె.దేవా, వై. కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

జోన్-2లో 99 టిడ్కో ఇళ్ల రద్దు

అభ్యంతరాల స్వీకరణకు గడువు ఈ నెల 11

మధురవాడ: జీవీఎంసీ జోన్-2 పరిధిలో 99 ఇళ్లు రద్దు చేస్తున్నట్లు జోన్-2 ఏపీడీ గురువారం ప్రకటనలో తెలిపారు. నగరంలో పీఎంఏవైయూ-ఎన్‌టీఆర్‌నగర్-ఏపీ టిడ్కో గృహ సముదాయం కింద 24,192మందికి ఇళ్లు కేటాయించినట్టు పేర్కొన్నారు. ఇందులో బ్యాంక్ సిబిల్ స్కోరు, వయసు పైబడిన వారు, వలస వెళ్లిపోయిన వారు, ఆసక్తి లేని వారు 215 మంది ఉన్నారని తెలిపారు. లబ్ధిదారుడు మరణించడం, వారి కుటుంబ సభ్యుల పేరు మీద మార్చమని వచ్చిన దరఖాస్తులు 123 ఉన్నాయని తెలియజేశారు. అందులో జీవీఎంసీ మధురవాడ జోన్-2 పరిధిలో 99 మంది ఉన్నారని పేర్కొన్నారు. వీరి ఇళ్లు రద్దు చేస్తున్నామని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 11వ తేదీ 4గంటల లోపు తెలియపరచాలని కోరారు. మరిన్ని వివరాలకు మధురవాడ జోన్ కార్యాలయం యూసీడీ విభాగంలో సంప్రదించాలని సూచించారు.

గంగమ్మా.. స్వచ్ఛ నగరం తీరు ఇదమ్మా..!



పేరేమో.. సిటీ ఆఫ్ డెస్టినీ.. కానీ.. పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్నట్లుగా మారిపోయింది. రెండేళ్ల క్రితం వరకూ స్వచ్ఛతలో ఓ వెలుగు వెలిగిన మహానగరం.. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మురుగు నగరంగా మారిపోయింది. ఎటు చూసినా చెత్తా చెదారమే దర్శనమిస్తోంది. అందుకే స్వచ్ఛ సర్వేక్షణ్‌లోనూ ఈ సారి 4 నుంచి 9వ స్థానానికి దిగజారిపోయింది. పెదజాలారిపేట సాగరతీరం సమీపంలోని గంగమ్మ తల్లి దేవాలయం సమీపంలోని ఈ చెత్తాచెదారం దుస్థితి చూస్తే.. ర్యాంకు ఎందుకు దిగజారిపోయిందో ఇట్టే అర్థమైపోతుంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

అప్పన్న తొలిపావంచా పరిసరాల సుందరీకరణ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన కొండదిగువ తొలిపావంచా పరిసరాలు త్వరలోనే కొత్త రూపుని సంతరించుకోనున్నాయి. జీవీఎంసీ నిధులు రూ.2 కోట్లతో ఆయా ప్రాంతాల్లో సుందరీకరణ పనులు చేపట్టనున్నారు. ఈ మేరకు జీవీఎంసీ జోన్-8 అధికారులు, సింహాచలం దేవస్థానం అధికారులు గురువారం సమావేశమై, సంబంధిత పనులపై చర్చించారు. ఇప్పటికే సిద్ధంగా ఉన్న నిధులతో ఏయే పనులు చేస్తామో జీవీఎంసీ అధికారులు దేవస్థాన సిబ్బందికి వివరించారు. ప్రధానంగా కొండ దిగువ ట్రాన్స్‌పోర్టు బస్టాండ్ ఏరియాని అభివృద్ధి చేసి, బస్‌బేలు ఏర్పాటు చేస్తామన్నారు. కొత్త తొలిపావంచా ఎదురుగా రోడ్డుపై విద్యుద్దీపాలు, రోడ్డుకు ఇరువైపులా మొక్కలు పెంచనున్నట్లు తెలిపారు. సమావేశంలో జెడ్సీ హేమావతి, ఈఈ దిలీప్, డీఈ ప్రవీణ్‌కుమార్, దేవస్థానం ఈఈ రామకృష్ణ, ఏఈవో రమణమూర్తి, ఏఈలు రవి రాజు, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

పవిత్రోత్సవాల్లో విశేష పూజలు



పవిత్రోత్సవాల్లో సిరులతల్లి

డాబాగార్డెన్స్: పవిత్రోత్సవాల్లో భాగంగా గురువారం కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి గణపతి పూజ, పుణ్యాహవాచనం, సప్తకలశ ఆరాధన, అభిషేకం, పవిత్ర ఆరోపణం, ప్రధాన హోమాలు, నీరాజన మంత్ర పుష్పం జరిపారు. సాయంత్రం 6.30 నుంచి మహా శాంతి హోమం, నిరాజన మంత్ర పుష్పం జరిపారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 8 గంటల నుంచి విశేష పూజలు, వేద ఆశీర్వచన చేయనున్నారు. మధ్యాహ్నం పంచామృతాభిషేకం అనంతరం 12.30 గంటల వరకు గర్భాలయ దర్శనాలు, ఆర్జిత సేవలు, శాశ్వత సేవలు నిలిపివేయనున్నట్టు ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. శుక్రవారం ఉదయం 5 గంటలకు నిర్వహించే పంచామృతాభిషేకం, దర్శనాలు నిలిపివేయనున్నట్టు చెప్పారు.

7న చంద్రగ్రహణం : ఈ నెల 7న చంద్రగ్రహణం కారణంగా మధ్యాహ్నం 1 నుంచి మరుసటి రోజు ఉదయం 7 గంటల వరకు ఆలయం మూసివేయనున్నట్టు చెప్పారు. గ్రహణానంతరం సోమవారం తెల్లవారు జామున సంప్రోక్షణ నిర్వహించి దర్శనాలకు అనుమతించనున్నట్టు చెప్పారు.